క్లుప్తంగా

చాగల్లు హైస్కూల్లో డీఈఓ తనిఖీ



చాగల్లులో జెడ్పీ హైస్కూల్లో మాట్లాడుతున్న డీఈఓ అబ్రహం

చాగల్లు: చాగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం డీఈఓ అబ్రహం అకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో రికార్డు అసిస్టెంట్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని ఈ సందర్భంగా పేరెంట్ కమిటీ చైర్మన్ ముద్రగడ కాశీకృష్ణ భగవాన్ డీఈఓ దృష్టికి తీసుకువెళ్లారు. కొత్తగా నిర్మిస్తున్న బాలికల జూనియర్ కళాశాల భవనంలో గ్రానైట్ వేసేందుకు నాడు -నేడు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని డీఈవో హామీ ఇచ్చారు. ఎంఈఓ వి.ఖాదర్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వీర్రాజు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘంటావారిగూడెంలో నేత్ర వైద్య శిబిరం



శిబిరంలో నేత్ర వైద్య పరీక్ష చేస్తున్న నిపుణుడు

నల్లజర్ల: లయన్స్ క్లబ్ దూబచర్ల శాఖ, పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని ఘంటావారిగూడెంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు ఈ శిబిరంలో దాదాపు 100 మందికి పరీక్షలు చేశారు. వారిలో 10 మందికి కంటి ఆపరేషన్లు అవసరమవుతాయని నిర్ధారించారు. వారందరికీ వేమగిరిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసి కళ్ల జోళ్లు అందజేయనున్నట్టు శిబిరం నిర్వాహకుడు అంబటి శ్రీనివాసరావు తెలిపారు. శిబిరాన్ని లయన్స్ క్లబ్ దూబచర్ల శాఖ అధ్యక్షుడు కెల్లా వాసు ప్రారంభించారు. డైరెక్టర్ తాతిన సత్యనారాయణ, కార్యదర్శి కె.మురళీరాజు, పంచాయతీ కార్యదర్శి బి.రత్నం, సోమిశెట్టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల తహసీల్దార్‌గా కృష్ణారావు



నల్లజర్ల: తహసీల్దార్‌గా పాగిరి కృష్ణారావు నియమితులయ్యారు. శుక్రవారం ఆయన నల్లజర్లలో బాధ్యతలు స్వీకరించారు.రాజమహేంద్రవరంలో సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ పదోన్నతిపై సీతానగరం తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఎన్నికల సందర్భంగా ఆయనను ఇక్కడ తహసీల్దార్‌గా నియమించారు. ఏ గ్రామంలో ఎవరికి సమస్యలు ఉన్నా నేరుగా వచ్చి తనను కలవవచ్చనన్నారు. ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.

ద్వారకా తిరుమల ఎస్సైగా సతీష్



ద్వారకాతిరుమల: స్థానిక ఎస్సైగా జి.సతీష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని జరుగుతున్న సాధారణ బదిలీల్లో భాగంగా కొవ్వూరు రూరల్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న సతీష్ ద్వారకాతిరుమలకు బదిలీపై వచ్చారు. ముందుగా ఆయన శ్రీవారి క్షేత్రాన్ని సందర్శించి స్వామి, అమ్మవార్లను దర్శించారు. ఈ సందర్భంగా పండితులు ఆలయ ముఖ మండపంలో ఆయనకు వేదా శీర్వచనాన్ని అందించారు. అనంతరం పోలీసుస్టేషన్‌కు చేరుకున్న సతీష్ రిజిస్టర్‌లో సంతకం చేసి బాధ్యతలను స్వీకరించారు.

వేలివెన్నులో 522 మందికి వైద్యం



శిబిరంలో సేవలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు భాస్కరరామయ్య

ఉండ్రాజవరం: అందరికీ సంపూర్ణ ఆరోగ్యం రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య అన్నారు. రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం మండలంలో వేలివెన్ను గ్రామంలో నిర్వహించారు. ఈ శిబిరాన్ని సందర్శించిన భాస్కరరామయ్య రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వేలివెన్ను పీహెచ్‌సీ డాక్టర్ సయ్యద్ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో వైద్య నిపుణులు ఆనంద్ సింధూజ, స్వాగతులు 522 మంది రోగులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. వారిలో అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణ బ్రహ్మానందం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాలెట్ యుద్ధానికి సిద్ధం

- గర్జించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- నేటి 'సిద్ధం' బహిరంగ సభకు సన్నాహకంగా కొవ్వూరు, నిడదవోలుల్లో భారీ ర్యాలీలు
- పార్టీ 'కొవ్వూరు' ఇన్‌చార్జి తలారి, నిడదవోలు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో..



సిద్ధం బహిరంగ సభకు మద్దతుగా కొవ్వూరులో బైక్ ర్యాలీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఆ పార్టీ శ్రేణులు



నిడదవోలు పట్టణంలో ఫ్ల కార్డులు చేత బట్టి ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, వైఎస్సార్ సీపీ శ్రేణులు

కొవ్వూరు: 'బ్యాలెట్ యుద్ధానికి తామంతా సిద్ధం 'అంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు గర్జించాయి. ఏలూరు సమీపంలోని దెందులూరులో శనివారం వైఎస్సార్ సీపీ నిర్వహించే 'సిద్ధం' బహిరంగ సభకు సన్నాహకంగా కొవ్వూరులో శుక్రవారం ఆ పార్టీ శ్రేణులు భారీ ఎత్తున మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించాయి. వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మెరక వీధి నుంచి మొదలైన ర్యాలీ మెయిన్ రోడ్డు, ఆర్డీవో కార్యాలయం, రైల్వేస్టేషన్ మీదుగా తిరిగి బస్టాండ్ వద్దకు చేరుకుంది.

మేమంతా సిద్ధంగా ఉన్నాం

ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పేదలు, పెత్తందారుల మధ్య సాగుతున్న యుద్ధానికి తామంతా సిద్ధం ఉన్నామని తెలియజెప్పేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దెందులూరులో సిద్ధం సభ నిర్వహిస్తున్నారన్నారు. మనమందరం కుడా రాబోయే ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం అన్నీ వాగ్దానాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిదే అన్నారు. గడచిన 56 నెలలుగా వివిధ సంక్షేమ పథకాల ద్వారా పేదలకు నేరుగా లబ్ధి చేకూర్చారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఎంపీపీలు జొన్నకూటి పోసిరాజు, కాకర్ల నారాయుడు, పార్టీ మండల శాఖల అధ్యక్షులు సుంకర సత్యనారాయణ, కాకర్ల వెంకటేశ్వరరావు, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, పార్టీ మండలశాఖ గౌరవాధ్యక్షుడు గన్నమని వీర వెంకట్రాజు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, జిల్లా అధికార ప్రతినిధి గంధం శేషసాయి, తోట రామకృష్ణ, ఉప్పులూరి సూరిబాబు, పోసిన శ్రీకృష్ణదేవరాయలు, ముళ్లపూడి కాశీవిశ్వనాథ్, గారపాటి శ్రీనివాస్, పరిమి సోమరాజు, అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, తోట నారాయణ, ఏలూరి విజయలక్ష్మి, యాళ్ల బాబురావు, పిట్టా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం సభను విజయవంతం చేద్దాం

నిడదవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం దెందులూరులో నిర్వహించే ఎన్నికల సమరభేరి సిద్ధం మహాసభకు పార్టీ శ్రేణులు భారీ ఎత్తున హాజరు కావాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన సిద్ధం ఫ్లకార్డులు పట్టుకుని శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కార్యకర్తా రాబోయే ఎన్నికల్లో సైనికుడిలా పనిచేసి పెత్తందారుల ఎత్తుగడల నుంచి పేదవాడికి విజయాన్ని అందించాలన్నారు. ప్రతి పేదవాడి కళ్ళల్లో ఆనందం కలకాలం నిలవాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. మహాసభ విజయవంతానికి ప్రతి కార్యకర్తా అడుగులు వేయాలని కోరారు. ర్యాలీలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్ పర్సన్ యలగడ బాలరాజు, పార్టీ పట్టణ, మండల శాఖల అధ్యక్షులు ముంగండి కృపానందం, అయినీడి పల్లారావు జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూర్యారావు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముళ్ళపూడి శ్రీనివాసచౌదరి, గోపిరెడ్డి శ్రీనివాస్, ఆకుల ముకుందరావు, ఎండీ ఫయాజ్, దిరిసిన రామచంద్రరావు, మానుకొండ చంద్రబాబు, చిలకల మల్లికార్జునరావు, తిక్క శ్రీను, ఉసురుమర్తి సూరి, గుర్రం జేమ్స్, ఎస్‌కే చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెప్పాలి



ద్వాక్రా మహిళలకు ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న హోం మంత్రి తానేటి వనిత

- హోం మంత్రి తానేటి వనిత
- లబ్ధిదారులకు ఆసరా చెక్కు అందజేత
- మండలంలో 16,250 మందికి రూ.15.37 కోట్ల మేర లబ్ధి

నల్లజర్ల: అమలు కాని హామీలిచ్చి ప్రజలను మోసగించిన చంద్రబాబుకు ఓటుతో మరోసారి బుద్ధి చెప్పాలని హోం మంత్రి తానేటి వనిత మహిళలకు పిలుపు నిచ్చారు. ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నల్లజర్ల జెడ్పీ హైస్కూల్ ఆవరణలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వనిత మండలంలోని 16,250 మంది డ్వాక్రా లబ్ధిదారులకు రూ.15.37 కోట్ల నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ చంద్రబాబు మరోసారి ప్రజల్ని నిలువునా మోసం చేస్తారనడానికి ఆయన చెబుతున్న అమలు కాని పథకాలే సాక్ష్యమన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు ప్రభుత్వం మహిళల్ని నమ్మించి మోసగించిందన్నారు. మహిళల బంగారం, డ్వాక్రా రుణాలు అన్నింటినీ రద్దు చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని మాఫీ చేయకుండా, ఎందుకు చెల్లించలేదంటూ మహిళలకు నోటీసులు పంపారన్నారు. కాగా ఇచ్చిన మాట ప్రకారం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు దఫాలుగా రుణమాఫీ చేశారన్నారు. ప్రతి మహిళా తమ కాళ్లపై తాము నిలబడేలా అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టారన్నారు. గత నాలుగున్నరేళ్లలో మహిళా సంక్షేమానికి సీఎం జగన్ చేసిన కృషిని దృష్టిలో పెట్టుకొని మనమంతా అండగా ఉండి ఆయనను సీఎంగా చేయాలన్నారు. మంత్రి వనిత మహిళల మధ్యకు వెళ్ళి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి మహిళలతో కలసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బంక జయలక్ష్మి, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, జెడ్పీటీసీ సభ్యురాలు ముప్పిడి లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ కారుమంచి రమేష్, నాయకులు బంక అప్పారావు, వెల్లంకి వెంకటసుబ్రహ్మణ్యం, మద్దిపాటి ప్రసాద్, ముప్పిడి వెంకటరత్నం, వామిశెట్టి పరమేశ్వరరావు, పావనీకుమారి, సర్పంచులు పల్లి జ్యోతి, గోతం సత్యలక్ష్మి, చెల్లారి రామశ్రీనివాస్, బండి చిట్టి, పిచ్చుకుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డులు

- పశు పోషణకు రూ.30 వేల బ్యాంకు రుణాలు
- జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి సత్యగోవింద్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి సత్యగోవింద్

కొవ్వూరు: పాడి రైతులను ప్రోత్సహించేందుకు పశు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రూ.30 వేల వరకూ వారికి బ్యాంకు రుణాలు ఇస్తున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి ఎస్‌జీటీ సత్యగోవింద్ అన్నారు. పట్టణంలోని ఏరియా పశు వైద్యశాలలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన కొవ్వూరు డివిజన్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ ద్వారా మహిళా రైతులు దరఖాస్తు చేసుకుంటే ఏడు శాతం వడ్డీపై స్వల్ప కాలిక రుణాలను అందిస్తారని చెప్పారు. దీనిలో మూడు శాతం కేంద్ర ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇస్తుందన్నారు. మిగిలిన నాలుగు శాతం వడ్డీతోనే రుణం పొందవచ్చన్నారు. పశువుల దాణా, గడ్డి, ఇతర ఖర్చులకు ప్రతీ రైతూ ఈ సొమ్మును వాడుకోవచ్చన్నారు. జిల్లాలోని పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామన్నారు. జిల్లాలో 2,68,625 పశువులకు టీకాలు వేయాల్సి ఉండగా ఇంత వరకూ 95 శాతం అంటే 2,36,700 పశువులకు టీకాలు వేశామన్నారు. పశుసంవర్ధక శాఖ ఏడీ ఎ.వెంకటరెడ్డి, డివిజన్ పరిధిలోని పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో బీసీలకు సముచిత స్థానం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు
- గౌడ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణారావుతో భేటీ



తలారి వెంకట్రావును సత్కరిస్తున్న రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు తాతా కృష్ణారావు

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాలకు అత్యంత ప్రాధాన్యం కల్పిస్తున్నారని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాతా కృష్ణారావును శుక్రవారం పట్టణంలోని ఆయన స్వగృహంలో తలారి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకట్రావుకు కృష్ణారావు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి గౌడ సామాజికవర్గం మద్దతు ఇవ్వాలని తలారి కోరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ వర్గానికి అత్యంత ప్రాధాన్యం కల్పించారన్నారు. నామినేటెడ్ పదవుల్లోనూ సముచిత స్థానం కల్పించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు, పార్టీ కొవ్వూరు నియోజకవర్గ పరిశీలకుడు రాజీవ్‌కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ శివరామకృష్ణలను తాతా కృష్ణారావు సత్కరించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, గోపాలపురం ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, నాయకులు బొర్రా కృష్ణారావు, ఉప్పులూరి సూరిబాబు, కంఠమణి రమేష్, మట్టా వెంకట్రావు, ఆరికిరేవుల సర్పంచ్ మట్టా శ్రీనివాస్, గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టా వీరబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు బొంత వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విశ్వసనీయతకు చిరునామా జగన్

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- గోపవరంలో రెండో రోజూ గడప గడపకూ..



గోపవరంలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: విశ్వసనీయతకు మారుపేరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని గోపవరం గ్రామంలో ఎంపీటీసీ సభ్యురాలు కర్రి సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు ఆరేపల్లి చంటి, తోలేటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెండో రోజు శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌లు అందజేశారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. గత ఐదేళ్లలో గోపవరం పంచాయతీ పరిధిలో రూ.22.16 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.3.47 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని ఎమ్మెల్యే గుర్తు చేశారు. లబ్ధిదారులకు అనువుగా ఉండేలా ఇళ్లస్థలాలు పంపిణీ చేశామన్నారు. స్థానికుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, పార్టీ నాయకులు వడ్డి రాజు, దొడ్ల మురళీకృష్ణ, తాతపూడి నాగేశ్వరరావు, శివ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

చారిత్రక, వారసత్వ సంపదను పరిరక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరంలోని చారిత్రక, వారసత్వ సంపదను పరిరక్షించాలని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కర్రి రామారెడ్డి సూచించారు. స్థానిక ఆనం రోటరీ హాలులో రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు ప్రముఖులు, వక్తలు పాల్గొన్నారు. కొన్ని సూచనలను, డిమాండ్‌లను చేశారు. స్వాతంత్ర్య సమర యోధుడు బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం పేరుతో ఉన్న చారిత్రక సుబ్రహ్మణ్య మైదానాన్ని సుందరీకరణ పేరుతో ఓపెన్ ఎయిర్ సినిమా ప్రాంతంగా మార్చడాన్ని తప్పుపట్టారు. చిత్రాంగి ప్యాలెస్ కింద ఉన్న సొరంగ మార్గం పెద్దాపురం పాండవుల మెట్ట వరకు ఉన్నట్లు అక్కడ చారిత్రక ఆనవాళ్లు చెబుతున్నాయని, వాటిని గుర్తించి చిత్రాంగి గెస్ట్ హౌస్‌ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని కోరారు. హేవ్‌లాక్ వంతెన, దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ, కందుకూరి వీరేశలింగం నడయాడిన పురం మందిరం, హితకారిణీ సమాజంలోని పురాతన కట్టడాల పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, కృష్ణకుమార్, పంతం కొండలరావు, టీకే.విశ్వేశ్వరరెడ్డి, జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన



సమిశ్రగూడెంలో రైతులకు ఎలుకల నివారణ మందు అందిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

నిడదవోలు రూరల్: తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించి సాగును లాభసాటిగా మార్చాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు రైతులకు సూచించారు. సామూహిక ఎలుకల నిర్మూలనపై శుక్రవారం సమిశ్రగూడెం ఆర్‌బీకే వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు ఎలుకల వల్ల చాలా నష్టం జరుగుతుందన్నారు. అనంతరం రైతులకు ఎలుకల నివారణ మందు తయారీకి నూకలు, బ్రోమోడయెలిన్ మందును రైతులకు అందజేశారు. నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ పి.చంద్రశేఖర్, ఏఓ జి.సత్యనారాయణ, రైతులు కస్తూరి సాగర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు మాధవన్, శివనాగు తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: దాళ్వా వరి పైరులో రైతులు సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టాలని ఏవో కె. కమల్ రాజ్ సూచించారు. ఎలుకల మందు వినియోగంపై మండల స్థాయిలో శుక్రవారం అనంతపల్లి గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ జయరామలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఓ కమల్‌రాజ్ మాట్లాడుతూ బ్రోమోడయెలిన్ 0.25 అనే మందును 10 గ్రాముల చొప్పున పొట్లాలుగా చేసి వ్యవసాయ శాఖ రైతులకు ఉచితంగా అందిస్తుందన్నారు. వాటిని వరి చేల గట్ల సమీపంలోని ఎలుకల బొరియల్లో వేసి వాటిని మూసి వేయాలన్నారు. మూడు, నాలుగు రోజులలో బొరియల్లోనే ఎలుకలు మరణిస్తాయన్నారు. మండలంలోని రైతులంతా ఒకేసారి ఈ కార్యక్రమం చేపట్టాలన్నారు. అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద బ్రోమోడయెలిన్ మందు అందుబాటులో ఉంటుందన్నారు.

చాగల్లు: మండలంలోని చంద్రవరం రైతు భరోసా కేంద్రం వద్ద శుక్రవారం సర్పంచ్ మద్దిపాటి శ్రీనివాసరావు అధ్యక్షతన ఏవో కె.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకలు నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రోమో డయెలిన్ అనే ఎలుకల నివారణ మందును రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. పొలాల్లో దానిని ఏ విధంగా వినియోగించాలో ఏవో గోపాలకృష్ణ రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ లక్ష్మీ ప్రసన్న, కె. అనూష , ఎన్. శ్రీనివాస్, రైతులు మద్దిపాటి హనుమంతరావు కంటమనేని వీరరాఘవులు పాల్గొన్నారు .

ఇసుక ర్యాంపును పరిశీలించిన కలెక్టర్



బల్లిపాడు ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మాధవీలత

తాళ్లపూడి: జిల్లాలోని ఓపెన్ ఇసుక రీచ్‌లలో తవ్వే ఇసుక పరిమాణాన్ని పెంచడానికి అనువైన పరిస్థితులు ఉన్నాయా? లేవా? అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్టు కలెక్టర్ కె .మాధవీలత తెలిపారు. తాళ్లపూడి మండలంలోని బల్లిపాడులోని గోదావరి ఓపెన్ ఇసుక ర్యాంపును శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ర్యాంపులో ఇసుక లభ్యత తదితర వివరాలను ఆమె ఇక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్‌తో పాటు ఇరిగేషన్ అధికారులు, మండల సర్వేయర్ వీరాస్వామి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఫొటోగ్రాఫర్లకు వర్క్‌షాప్

నిడదవోలు: స్థానిక ఎస్‌వీఎస్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం ఫొటోగ్రాఫర్లకు వర్క్‌షాప్ నిర్వహించారు. నిడదవోలు ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జిల్లా ఫొటో, వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాపు నిర్వహించారు. నూతనంగా వచ్చిన కెమెరాలకు ఉన్న లేటెస్ట్ టెక్నాలజీ గురించి కార్యక్రమంలో మెంటార్ షేక్ హుస్సేన్ ఫొటోగ్రాఫర్లకు వివరించారు. ప్రస్తుత పోటీతత్వంలో లేటెస్ట్ కెమెరాల్లో ఉన్న ఆప్షన్స్ ఎలా ఉపయోగించుకోవాలో చెప్పారు. అధిక సంఖ్యలో ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్ సస్పెన్షన్

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం గ్రామ సచివాలయం-1 పరిధిలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె. శశిప్రియాంకను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ కె. మాధవీలత శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామంలోని పోలింగ్ కేంద్రం 84లో బీఎల్‌ఓగా ఆమె విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాలో మృతుల ఓట్లు, డబుల్ ఎంట్రీలు ఉండడంతో ఓటర్ల పరిశీలనలో బీఎల్‌ఓ శశిప్రియాంక నిర్లక్ష్యంగా వ్యవహించినట్టు ఫిర్యాదు రావడంతో విధుల నుంచి తొలగించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'సిద్ధం' సభకు నేడు కాపవరం నుంచి ర్యాలీ

కొవ్వూరు: దెందులూరులో నిర్వహించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం బహిరంగ సభకు తరలి వెళ్లే వారందరి వాహనాలు శనివారం ఉదయం పది గంటలకు కాపవరం జంక్షన్‌కు రావాలని వైఎస్సార్ సీపీ కొవ్వూరు మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ కోరారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తారన్నారు. కాపవరం కూడలి నుంచి వాహనాలన్నీ ర్యాలీగా దెందులూరు తరలి వెళ్లనున్నట్టు తెలిపారు.

సిలిండర్ల పట్టివేత

కంబాలచెరువు: గృహావసరాల గ్యాస్ సిలిండర్ల వినియోగంలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఇన్‌చార్జి రీజినల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సురేష్‌బాబు హెచ్చరించారు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని ఆంధ్రా మిలటరీ హోటల్‌లో డొమెస్టిక్ (గృహ) సిలిండర్లను ఉపయోగిస్తున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం ఆ ప్రాంతంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో హోటల్లో ఐదు గృహావసరాల సిలిండర్లను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని, హోటల్ యజమాని బి.హేమంత్ కుమార్‌పై కేసు నమోదు చేశారు.

కళాతపస్వి విశ్వనాథ్‌కు నివాళి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రముఖ దర్శకుడు, కళాతపస్వి కె.విశ్వనాథ్ ప్రథమ వర్ధంతిని శుక్రవారం స్థానిక జిత్‌మోహన్‌మిత్ర కళా వేదికపై నిర్వహించారు.